కారు, బైక్ ఢీ

బయటపడ్డ గంజాయి ప్యాకెట్లు

ప్రజాశక్తి - అనంతగిరి: ఏజెన్సీ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి గుట్టు చప్పుడుగా తరలిస్తుండగా ప్రమాదం జరగడంతో గంజాయి ప్యాకెట్లు ఘాట్ రోడ్‌లో పట్టుబడ్డాయి. అనంతగిరి పోలీస్ స్టేషన్ సమీపంలో వైఎస్ఆర్ విగ్రహం మలుపు వద్ద ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో కారు, బైక్ ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కారు ముందు భాగం నుంచి బయట పడ్డాయి. స్థానిక పోలీసులు రెండు వాహనాలు, గంజాయిను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రమాదానికి గురైన కారు

నిలకడగా గోదారి, శబరి

- ఇంకా భయం గుప్పెట్లోనే విలీన మండలవాసులు
- పునరావాస కేంద్రాల్లో అసౌకర్యాలతో అవస్థలు
- విషకీటకాలు, దోమలతో భయం భయంగా జీవనం

భారీ వర్షానికి చిడుమూరు గ్రామంలో కూలిన దుర్గా అర్జమ్మ ఇల్లు

వడ్డుగూడెం గ్రామం వద్ద రోడ్డుపైకి వచ్చిన నీరు

ప్రజాశక్తి-చింతూరు :వారం రోజుల నుంచి జోరుగా కురుస్తున్న వర్షాలకు శబరి,గోదావరి నదులు పొంగి ప్రవహించడంతో విలీన మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం సాయంత్రానికి గోదావరిలో 43 అడుగులకు వరద నీరు చేరడంతో ఒకటో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. శుక్ర, శనివారాల నుంచి గోదారమ్మ దోబూచులాడుతూ ప్రవహిస్తోంది గోదావరి నదిలో, నీటిమట్టం నిలకడగా ఉన్నప్పటికీ, శబరి నది పోటెత్తడంతో చింతూరు మండలంలోని. ముకునూరు, ఎజి. కోడేరు, పెద్ద సీతనపల్లి, కుయ్యూర్ నాలుగు గ్రామ పంచాయతీలు, విఆర్ పురం మండలంలోని కుందులూరు గ్రామపంచాయతీలలో మొత్తం 20 గ్రామాలకు చింతూరు మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.గోదావరి పరివాహక ప్రాంతం ఎగువ ఛత్తీస్‌గఢ్ ,తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరదరాగా, గోదావరి, శబరి ఉపనదులు సీలేరు, శోకులేరు నదులు ఉప్పొంగడంతో శనివారం నాటికి 30గ్రామాలకు నిలిచిన రాకపోకలు, ఆయా నదుల్లో వరద ఉధృతి తగ్గడంతో రహదారులపై ముంపు ప్రభావం తగ్గి, ఆంధ్ర, ఒడిశా మధ్య రాకపోకలు ఆదివారం ఉదయం నుంచి పునరుద్ధరించబడ్డాయి. భారీ వర్షానికి చిడుమూరు గ్రామంలో దుర్గా అర్జమ్మ ఇల్లు కూలిపోయింది.

అప్రమత్తంగా అధికారులు

గోదావరి, శబరి, వాటి ఉపనదుల్లో వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో అధికారయంత్రాంగం అప్రమత్తంగానే ఉంది. చింతూరులో ఎంపిడిఒ వెంకటరత్నం, తహశీల్దార్ కారం సుబ్బారావు, ఆర్‌ఐ దేవయ్య, వివోఓలు, పంచాయతీ సెక్రటరీలు రేయింబవళ్లు విధి నిర్వహణలో ఉంటూ వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. ఐటిడిఎ పిఒ సూరజ్ గనేరో చింతూరులోనే మకాం ఉండి వరద పరిస్థితులను సమీక్షిస్తున్నారు. శనివారం రాత్రి చింతూరులోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రానున్న నాలుగు రోజులు వర్షాలు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో విలీనమండలాల వాసులు బిక్కుబిక్కుమంటున్నారు.

చింతూరు మండలంలో వరద నీటి ప్రవాహం

పునరావాస కేంద్రాల్లో సౌకర్యాల లేమి

విఆర్.పురం : వరదనీటి మట్టం పెరుగుతూ, తగ్గుతూ గోదారమ్మ ముంపు బాధితులతో దోబూచులాడుతోంది. భద్రాచలం వద్ద శనివారం సాయంత్రం 7 గంటలకు 40.9 అడుగులు ఉన్న గోదావరి, ఆదివారం మధ్యాహ్నం 12 గంటల 43.9 అడుగుల చేరి, సాయంత్రం మూడు గంటలకు 43అడుగుల వద్ద నిలకడగా ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద గోదారి తగ్గుముఖం పట్టినప్పటికీ, ఆదివారం రాత్రి కిన్నెరసాని డ్యామ్ మూడు గేట్లను ఎత్తనుండడంతో వరదనీటి మట్టం రాత్రికి మరింత పెరగనుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. మరోఓ ఐదు రోజులు వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు కూడా బాధితులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గోదారి వరద ఉధృతితో సురక్షిత ప్రాంతాలకు చేరి గుడారాలో ఉంటున్న ముంపు బాధితులు గోడు వినే నాధులే కరువయ్యారని వాపోతున్నారు. పునరావాస కేంద్రాల్లో తినడానికి సరైనతిండి లేదు. బియ్యం, నిత్యవసరాలు, బరకాలతోపాటు కిరోసిన్, కొవ్వొత్తులు సరఫరా చేయాలని వేడుకుంటున్నారు. వరదల్లో కొట్టుకొచ్చిన పాములు, విషకీటకాలతో బతుకు దుర్భరంగా మారిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణకు చర్యలతోపాటు పాముకాటు వ్యాక్సిన్‌ను అందుబాటులో ఉంచాలని అభ్యర్థిస్తున్నారు.

ముంపు గ్రామాల్లో రేషన్ పంపిణీ

బిక్కుబిక్కుమంటూ జీవనం

కూనవరం :మూడు రోజులుగా హెచ్చుతగ్గులతో గోదారమ్మ వరద ముంపు ప్రాంత ప్రజల గుండెల్లో భయం పుట్టిస్తోంది. ఆదివారం నిలకడగా ప్రవహిస్తున్నప్పటికీ, ఎగువ తెలంగాణలోని కిన్నెరసాని డ్యామ్ నుంచి నీటి విడుదలతో గోదావరి నీటి మట్టం పెరగనుందన్న అధికారుల హెచ్చరికలతో జనం భీతిల్లుతున్నారు .ఆదివారం కూనవరం వద్ద 17.84మీటర్ల వరదతో మొదటి ప్రమాద హెచ్చరిక దాటి గోదావరి ప్రవహించింది. కూనవరం, టేకులబోరు గ్రామాల లోతట్టు ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకున్నారు. శబరిమల పరివాహక ప్రాంతాల్లో గిరిజన ప్రజలు ఊళ్లను అంటిపెట్టుకుని, ఎత్తయిన ప్రాంతాలలో ముందస్తుగా చిన్న పాకలు వేసుకుంటున్నారు.

కలవర పెడుతోన్న గోదావరి

ఎటపాక : భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రవాహం నిలకడగా ఉన్నప్పటికీ, ఆదివారం రాత్రి నుండి వరద ఉధతి పెరిగే అవకాశం ఉందని సిడబ్ల్యుసి అధికారులు అంచనా వేస్తున్నారు. నాలుగు రోజులుగా వరద కాస్త తగ్గుతూ పెరుగుతూ ముంపు వాసులను కలవరపెడుతుంది. ఈ వరద ఇలాగే కొనసాగితే వ్యవసాయ పనులు ఆలస్యం అవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది వరదల కారణంగా మిర్చి పంట ఆలస్యమైందని, ఇపుడు ప్రతికూల పరిస్థితులపై ఆవేదన చెందుతున్నారు.

సహాయక చర్యల్లో నిర్లక్ష్యం

గ్రామం చుట్టూ వరదలు ముంచెత్తడంతో రేఖపల్లిలో గుడారాలు వేసి ఉంటున్నాం. మూడు రోజులౌతున్నా ప్రభుత్వం నంఉచి కనీస సాయం లేదు. విషకీటకాలు, దోమల మధ్య దుర్భభంగా జీవిస్తున్నాం. బియ్యం, నిత్యవసరాలు, బరకాలు, కిరోసిన, కొవ్వొత్తులు సరఫరా చేయాలని పునరావాసం, ప్యాకేజీని వన్‌టైమ్ సెటిల్మెంట్‌గా ఇచ్చి, సురక్షిత ప్రాంతానికి తరలించి, బాధల నంఉచి విముక్తి కల్పించాలి. ముంపుబాధితులను అధికారులు, నేతలు పట్టించుకునే దిక్కు లేదు.

పొరుతుల వెంకటరమణ, వడ్డుగూడెం, విఆర్ పురం మండలం

ప్యాకేజీ ఇచ్చి పంపించేయండి

చిన్నపాటి వరదకే గ్రామం చుట్టూ వరద ముంచెత్తుతోంది. గతేడాది దాదాపు 20రోజులపాటు ఎగువ ప్రాంతాల్లోని గుట్టలకు వెళ్లి, పాకల్లో చీకటిలోనే కనీస వసతులు లేని స్థితిలో తల దాచుకున్నాం. ఆ పరిస్థితులు తలచుకుంటేనే ఇపుడు ఒళ్లు గగుర్పొడుస్తోంది. ఇపుడు అదే పరిస్థితి వచ్చేలా ఉంది. నిర్వాసితుల బాధలను ప్రభుత్వాలు పట్టించుకోవాలి, పునరావాసం, ప్యాకేజీ ఇచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. మమ్మల్ని ఇంకా ముంచడం తేల్చడం ప్రభుత్వం చేతిలోనే ఉంది.

నాగమణి, రేపాక గ్రామం, కూనవరం మండలం

ఎర్రగట్టు గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చాలి

గోదావరి వరదల్లో జలదిగ్బంధంలో చిక్కుకునే ఎర్రగట్టు గ్రామాన్ని41.15 కాంటూరులో చేర్చి ఆదుకోవాలి. 2020 వరదల నుంచి తేరుకొనే లోపే 2022 వరద భీభత్సం ఊరు మొత్తాన్ని ముంచేసింది. అడవిలో గుడారాలు వేసుకొని ఉన్నాం. ఆ వరదల్లో 32 ఇళ్లు, తర్వాత 40ఇళ్లు కూలిపోయాయి. వరద తగ్గాక బురద, దుర్వాసనతో రెండునెలల వరకు ఇళ్లలోకి వెళ్లలేక పోయాం. ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఇళ్లు శుభ్రపరచడానికే సరిపోలేదు. వరద కష్టాలకు శాశ్వత పరిష్కారంగా 41.15 కాంటూరులో చేర్చి పునరావాసం కల్పించాలి.కాటుకపల్లి నుండి ఎర్రగట్టు వరకు ప్రత్యామ్నాయ రహదారిని పునరుద్ధరించాలి.నందిగామ, బండారిగూడెం, చలంపాలెం గ్రామాలకు వరదల సమయంలో ఉపయోగకరంగా ఉంటుంది.

పర్సిక ధర్మరాజు, ఎర్రగట్టు గ్రామం, ఎటపాక మండలం

కొందరికే సౌకర్యాలు కల్పించడం దుర్మార్గం

మాట్లాడుతున్న సిపిఎం నేత

కూనవరం :మండలంలోని పునరావాస కేంద్రాలలో సోలార్‌దీపాలు, మంచినీటి వసతి ఏర్పాటు చేయాలని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య కోరారు. ఆదివారం మండలంలోని పల్లూరు గ్రామంలో సమావేశంలో మాట్లాడుతూ కేవలం ఎంపిపి, జెడ్‌పిటిసిలు ఉన్న ప్రాంతాల్లో మాత్రమే విద్యుత్ మంచినీటి వసతి కల్పించడం దుర్మార్గం. పునరావాస కేంద్రాలలో బాధితులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, ఏదో ఒక గ్రామానికి సౌకర్యాలను కల్పించి, అందరికీ ఇచ్చేసినటుల చేతులు దులుపుకోవడం సరికాదు, సిగ్గుచేటన్నారు. ప్రతి బాధితుడికి నిత్యావసర సరుకులు, టార్పాలిన్ అందించాలి. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీత రామయ్య, సర్పంచ్ నాగమణి, ఎంపిటిసి జయసుధ కుంజారాధ, జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, ఆవుల మురళి, ఆవుల ఉపేంద్రబాబు బొర్రయ్య, పాల్గొన్నారు.

ముంపు బాధితులను ఆదుకోవాలి

ముంపు బాధితులను పరామర్శిస్తున్న సాయికృష్ణ

వి.ఆర్.పురం: మండలంలోని వడ్డిగూడెం, చిన్న మట్టపల్లి, రామవరం, శ్రీరామగిరి పంచాయతీల పరిధిలోని గ్రామాలకు మూడు రోజులుగా రాకపోకలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆదుకోవాలని జనసేన పార్టీ మండల కార్యదర్శి ములకాల సాయికృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం వడ్డిగూడెంలో వరద ముంపు ప్రాంతాన్ని సందర్శించి, బాధితులను పరామర్శించారు. ముంపు బాధితులకు తక్షణం రూ.పదివేల సాయంతోపాటు వారికి బియ్యం, నిత్యవసరరాలు, మినరల్ వాటర్, కిరోసిన్ అందించాలని కోరారు. పునరావాసం, ప్యాకేజీ ఇచ్చి ఏటా ముంపుబాధితులు పడే కష్టాల నుంచి వారికి రక్షించాలని కోరారు. కార్యక్రమంలో మండల యూత్ నాయకులు గూటాల సమ్మరాజు, పవన్, దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు .

వరి నారును వేస్తున్న గిరిజన మహిళలు

వ్యవసాయ పనులతో మన్యం కళకళ

పొలం పనుల్లో గిరిజనులు బిజీ

నారును తీసుకెళుతున్న మహిళలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లావ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఖరీఫ్ వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. గోదావరి పరివాహక ప్రాంతం పరిధిలోని జిల్లాలోని ముంపు మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాల్లోనూ తాజాగా కురిసిన వర్షాలు సాగుకు అనుకూలంగా ఉన్నాయని రైతులు అంటున్నారు. జిల్లాలోని ముంపు మండలాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ ఖరీఫ్ వ్యవసాయ పనులతో మన్యంలోని పంట పొలాలు కళకళలాడుతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవడంతో వ్యవసాయ భూములన్నీ తడిచి ముద్దయ్యాయి. గిరిజన రైతులు ఖరీఫ్ వరి సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం పలువురు రైతులు నారుమడులను సిద్ధం చేసుకుంటుండగా, మరి కొంతమంది నాట్లు వేస్తున్నారు. వేసిన నారుమళ్లు ఆశాజనకంగా ఎదగడంతో వాటిని సేకరిస్తున్న గిరిజన రైతులు ప్రస్తుతం వరి నాట్ల పనుల్లో బిజీగా మారారు. అన్నిచోట్ల వరి నాట్లు పనులు హుషారుగా జరుగుతున్నాయి. దీంతో ఏజెన్సీలోని గిరిజన రైతులంతా ప్రస్తుతం బిజీబిజీగా ఉన్నారు.

జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో లక్షా 21 వేల హెక్టార్లలో పంటలు సాగు అవుతుండగా, దానిలో వరి 59,189 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ముందస్తుగా వేసిన నారుమడులన్నీ ఆశాజనకంగా ఎదగడంతో వాటిని సేకరించిన గిరిజన రైతులు దమ్ము పనులు పూర్తయిన పంట భూముల్లో వరి నాట్లను ముమ్మరం చేశారు. వరదల కారణంగా చింతూరు ఐటిడిఎ పరిధిలోని చింతూరు, కూనవరం, విఆర్ పురం, ఏటపాక మండలాల్లో వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యాయి. విలీన మండలాల్లో గోదావరి వరదల విలయంతో వ్యవసాయ భూములన్ని ముంపు బారిన పడడం బాధాకరం. మిగిలిన మండలాల్లో మాత్రం వర్షాలు వ్యవసాయ భూములకు మేలు చేయడంతో ఆయా రైతులంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి వర్షాలు సమృద్ధిగా కురిసాయి. దీంతో, మే నెలాఖరు నుంచి రైతులు వేసవి దుక్కి పనులను ప్రారంభించి జూన్ నెలాఖరుకి దుక్కి పనులు పూర్తి చేశారు. అలాగే మెట్ట ప్రాంతంలో రాగులు వేసుకునే రైతులు సైతం నారు నాటడం, విత్తనాలు వెదజల్లే పద్ధతిలో రాగుల సాగుకు అవసరమైన దుక్కి పనులు చేపడుతున్నారు. దీంతో, ప్రస్తుతం ఏజెన్సీలో ఎటు చూసినా పచ్చని వ్యవసాయ భూములు, ఆయా భూముల్లో వ్యవసాయ పనులు చేపడుతున్న గిరిజన రైతులు కనిపిస్తున్నారు. ప్రస్తుతం వరి నాట్లన్నీ హుషారుగా జరుగుతుండటంతో జులై నెలాఖరు, ఆగస్టు మొదటి వారానికల్లా మొత్తం వరి నాట్లు పూర్తయ్యే పరిస్థితులు ఉన్నాయని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

దుక్కిదున్నుతున్న రైతు

జిల్లాలో ఖరీఫ్ పంటల వివరాలు	
వరి	59,189 హెక్టార్లు
అపరాలు	2,820 హెక్టార్లు
నూనె గింజలు	1,405 హెక్టార్లు
ఇతర పంటలు	38,695 హెక్టార్లు

మణిపూర్ సిఎం రాజీనామా చేయాలి

-హింసాత్మక, అత్యాచార ఘటనలపై స్పందించక పోవడం దారుణం - రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు

చింతపల్లిలో మాట్లాడతున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-అరకులోయ: మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై అత్యాచారం, మరణ హోమం అరికట్టడంలో విఫలమైన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని అరకులోయలో ఆదివారం ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు డిమాండ్ చేశారు.మణిపూర్ ఆదివాసీ మహిళలపై జరుగుతున్న మారణహోమంపై రాష్ట్రపతి వెంటనే జోక్యం చేసుకోవాని డిమాండ్ చేశారు. అక్కడి ఆదివాసీ మహిళలపై బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ సహకారంతో జరుగుతున్న మరణ హోమాన్ని వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో ఆదివాసి గిరిజన సంఘం అద్యర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడారు. మహిళల పై సామూహిక అత్యాచారంకు పాల్పడిన వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, ఆదివాసీ మహిళల పై సామూహికంగా అత్యాచారానికి పాల్పడిన నిందితులను శిక్షించి, వెంటనే శాంతి నెలకొల్పాలని డిమాండ్ చేశారు. మహిళలను నగ్నంగా రోడ్డుపై ఊరేగిస్తూ సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ, మణిపూర్ ఘటలనపై ఆ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ ఘటనపై బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రపతి స్పందించక పోవడం బాధాకరమన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దుర్మార్గమని విమర్శించారు. ఇప్పటికైనా ఆదివాసులపై దాడులు, దౌర్జన్యాలు అరికట్టాలని డిమాండ్ చేశారు.

ఆదివాసి గిరిజన సంఘం నాయకులు పి. రామన్న, అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మహిళ సంఘం నాయకులు వివి జయ, నేరనిరోధక సంఘం నాయకులు కృష్ణకుమారి, ఎపిటిఫ్ నాయకులు ఈశ్వరరావు, పిఆర్‌టియు నాయకులు సూర్యప్రకాష్, దండకారణ్య సంఘం నాయకులు ప్రసన్న, ఏపీఎస్ వ్యవస్థాపకుడు చట్టు మోహన్, యుటిఎఫ్ జిల్లా నాయకులు రఘునాథ్, చిట్టిబాబు,నారాయణ, మోహన్,బాలకష్ణ, సీఐటీయూ నాయకులు సింహాద్రి, ఆదివాసి కాఫీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సుంకరమెట్ట పంచాయతీ సర్పంచ్ జి. చిన్నబాబు, ట్రైబల్ జర్నలిస్ట్ పాడేరు డివిజన్ ప్రధాన కార్యదర్శి డి.గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్. ఐసుబాబు, ఆదివాసి మాతభాష సంఘం నాయకులు ఎస్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాడేరు: మణిపూర్ రాష్ట్రంలోని గిరిజన మహిళలపై అఘాయిత్యాలు అల్లర్ల వెనుక బిజెపి హస్తం ఉందని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరు జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ విమర్శించారు ఆదివారం గిరిజన సంఘం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ, ఆదివాసి గిరిజన సంఘం, ఆదివాసి మహిళా సంఘం ఆధ్వర్యాన చింతపల్లిలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ,. మణిపూర్ రాష్ట్రం తగలబడుతున్నా కేంద్రం చూస్తుంది తప్ప కనీసం స్పందించలేదని మండిపడ్డారు. ఈ అఘాయిత్యాలపై రాష్ట్రపతి నోరు విప్పకపోవడం బాధాకరమన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పాంగి జీవన్ కృష్ణ, మండల నాయకులు కొర్ర కార్తీక్, ఆదివాసి గిరిజన మహిళా సంఘం పి రత్నం, లక్ష్మి పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన అమానుషం

- అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం

పాడేరు టౌన్: మణిపూర్ ఘటన అమానుషం, చాలా బాధాకరం ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి ఘటనలు పునారావతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం ఎఎస్ఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముఖి శేషాద్రి, బి.సింహాచలం అన్నారు. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం అల్లూరి జిల్లా సర్వసభ్య సమావేశం పాడేరు గిరిజన భవన్ లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన మహిళలను వివస్త్రలను చేసి, ఊరేగించిన దుర్ఘటన యావత్ భారతావనికే సిగ్గుచేటన్నారు. మణిపూర్ ఘటనల కారకులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లా శాఖ ఏర్పాటు సంవత్సర కాలం పూర్తయినందున సంఘం చేపట్టిన కార్యకలాపాలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ యుపి పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా, మండల కార్యవర్గంలో ఖాళీ స్థానాల్లో కొత్తవారికి అవకాశం కల్పించారు. ఈ సమావేశంలో నాయకులు రామకష్ణ, కూడా సింహాద్రి, కిల్లు రామ్మూర్తి నాయుడు, ఎస్. పూర్ణచంద్రావు, ఈశ్వర రావు, అనిల్ కుమార్, సూర్యనారాయణ, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శేషాద్రి

తీవ్రంగా ఖండిస్తున్నాం

ఎపి ఆదివాసీ వికాస్ పరిషత్

పాడేరుటౌన్: మణిపూర్‌లో ఆదివాసీలపై దాడులను, మహిళలపై పాశవిక చర్యలను ఎపి ఆదివాసి వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు అడపా బొంజునాయుడు తీవ్రంగా ఖండించారు. ఎపి ఆదివాసి వికాస్ పరిషత్ అల్లూరి జిల్లా కార్యవర్గ సమావేశం పాడేరు గిరిజన భవన్ లో ఆదివారం జరిగింది. ఆగస్టు 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున ఆదివాసి ఉద్యోగులకు సెలవు దినంగా ప్రకటించాలన్నారు. ఆదివాసీల హక్కులు, చట్టాలు సక్రమంగా అమలు చేయాలని, గిరిజన ప్రాంతంలో గిరిజనేతరుల చొరబాట్లు అరికట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సంవత్సరం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని చింతపల్లి మండలం అన్నవరంలో నిర్వహించుటకు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో పరిషత్ నాయకులు నాగంనాయుడు, విలియమ్, కోడ సింహాద్రి, బూడిదే చిట్టిబాబు, ముత్యాలమ్మ, లక్ష్మి, కొండమ్మ, సావిత్రి, రమణమ్మ, ఊర్వసి రాణి, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరులో రాస్తారోకో

ప్రజాశక్తి- కొయ్యూరు: మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై దుశ్చర్యకు పాల్పడిన నిందితులను తక్షణమే ఉరి తీయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు సలుమూర్తి సూరిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. మణిపూర్‌లో నెలల తరబడి ఆకృత్యాలు, మారణహోమాలు జరుగుతున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందించకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఆదివాసీ నేతలు, విద్యార్థులు

పెదబయలులో నిలిచిన బస్సు

కండిషన్ లేని బస్సులతో అవస్థలు

ప్రజాశక్తి- పెదబయలు :పాడేరు నుండి వయా లక్ష్మీ పేటకు వెళ్లే పాడేరు ఆర్టీసీ బస్సు కండిషన్‌లో లేక ఆదివారం పెదబయలులో ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో వెనక్కి తిప్పేశారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం ఉదయం పాడేరు నుండి ఆరాధగూడెం బస్సు వెళ్లాల్సి ఉంది. బస్ ఆరాధగూడెం ఘాట్ ఎక్కదని డ్రైవర్ ప్రయాణికులతో చెప్పడంతో సుమారు 20 మంది ప్రయాణికులు పెదబయలు మండల కేంద్రంలో దిగి పోయారు. గత్యంతరం లేని పరిస్థితిలో ప్రయాణికులు అధిక చార్జీలు చెల్లించి ఆటోల్లో ప్రయాణమయ్యారు.

గంగవరం కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

ప్రజాశక్తి -గాజువాక : అదానీ గంగవరం పోర్టు కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు స్పష్టం చేశారు. అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా నిర్వాసిత కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు ఆదివారం నాటికి 20వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని జగ్గునాయుడు ఆదివారం సందర్శించి మాట్లాడారు. పోర్టు నిర్మాణానికి భూములు, సముద్రాన్ని త్యాగం చేసిన నిర్వాసితులకు తగిన వేతనాలు చెల్లించేందుకు అదానీ యాజమాన్యానికి ఎందుకు చేతులు రావడంలేదని ప్రశ్నించారు. షాప్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ పేరుతో అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ కార్మికుల శ్రమను దోచుకోవడం యాజమాన్యం మానుకోవాలన్నారు. అదానీ గంగవరం పోర్టు గత సంవత్సరం రూ.2000 కోట్ల మేర టర్నోవర్ చేసిందని, రూ.700 కోట్ల నికర లాభాలు వచ్చాయని తెలిపారు. ఇది ఏ రకంగా షాప్ అవుతుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక శాఖ కల్పించుకొని జిపిఎస్ పేరుతో ఉన్న షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ రిజిస్ట్రేషనను రద్దుచేయాలని కోరారు. గంగవరం పోర్టు కార్మికులకు న్యాయం జరిగే వరకూ అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు అండగా నిలుస్తాయన్నారు. యాజమాన్యం మొండి పట్టు వదలి సంప్రదింపుల ద్వారా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఈ ఆందోళన మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. కార్మికులు ఏ పిలుపునిచ్చినా సిపిఎం ప్రత్యక్షంగా పాల్గొంటుందని ప్రకటించారు.

కార్మికులకు కాంగ్రెస్ మద్దతు : గిడుగు

ఎపి పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు కాంగ్రెస్ పార్టీ బృందంతో కలిసి శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ఏపి కాంగ్రెస్ కమిటీ సంపూర్ణమైన మద్దతు ఉంటుందని తెలిపారు. కేంద్రంలోని బిజెపికి తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వ వాటాను అదానీకి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కట్టబెట్టారని విమర్శించారు. 30 సంవత్సరాలు తర్వాత పోర్టు ప్రభుత్వ పరం అవుతుందని అప్పటి ప్రభుత్వం చెప్పిందని, దాన్ని విస్మరించి నేటి ముఖ్యమంత్రి అదానీకి అప్పగించడం సరికాదన్నారు. ఆగస్టు నెలలో రాహుల్‌గాంధీ విశాఖపట్నం వస్తున్నారని, ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ, యాజమాన్యంతో సంప్రదింపులు జరుపుతున్నప్పటికీ జీతభత్యాలపై స్పష్టత రావడం లేదన్నారు. యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తూ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు నిరాకరిస్తుందని తెలిపారు. సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు నిరసన శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజు, వాసుపల్లి ఎల్లాజీ, గండిపల్లి అప్పారావు, మాద అప్పారావు, పేర్ల నూకరాజు, గండిపల్లి లక్ష్మయ్య, కదిరి సత్యానందం, నొల్లి స్వామి, కొవిరి అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై మండిపడుతున్న మన్యం

ప్రజాశక్తి-పాడేరుటౌన్ : మణిపూర్ మారణ హోమం, హింసాకాండ, అఘాయిత్యాలు, అల్లర్లపై అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీ వ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు రగులుతున్నాయి. మానవత్వాన్ని మంటగలిపేలా మణిపూర్ రాష్ట్రంలో చోటు చేసుకున్న అత్యంత ఆటవిక చర్యపై గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, మహిళ, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. అత్యంత ఘోర ఘటనపై ఆయా సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిజెపి నియంతృత్వ పాలనకు నిదర్శనమని, అత్యంత పాశవికమైన చర్యలు, అరాచకాలు, అల్లర్లను అదుపు చేయడంలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడుతున్నారు. మణిపూర్ అమానుషమైన ఘటనలను తీవ్రంగా ఖండిస్తూ పాడేరు మన్యం వ్యాప్తంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి.

మతోన్మాదుల అజెండాతోనే దాడులు

మణిపూర్‌లో మతోన్మాదుల దుష్ట అజెండాతో ఆదివాసులపై పైశాచిక దాడికి కారణమైంది. కార్పొరేట్ కంపెనీలకు మైనింగ్ అప్పగించాలని మోడి ప్రభుత్వం భావించింది. తెగల మధ్య దాడిగా ప్రారంభించి ఆదివాసీ క్రైస్తవ చర్చిలు ధ్వంసం, పాస్టర్స్‌ను చంపడం జరిగింది. మే 3న ప్రారంభమైన గొడవలపై మోడి స్పందించి ఉంటే ఘోరకలి జరిగేవి కావు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణలో పోలీస్, మిలటరీలు పాశవికమైన చర్యలకు సహకరించడం దారుణం.

పి.అప్పలనర్స
సిపిఎం జిల్లా కార్యదర్శి

బిజెపి విధానాలే కారణం

మణిపూర్ అల్లర్లు, అఘాయిత్యాలపై బిజెపి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమైన చర్య. హింసాత్మక ఘటనలను పట్టించుకోకుండా దాడులను ప్రోత్సహించడం సిగ్గుచేటు. అల్లర్లతో మణిపూర్ అట్టడుకుతుంటే కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయం. దేశం తల దించుకునే విధంగా బిజెపి పాలన సాగుతోంది. దేశం యావత్తు ఒక తాటిపై నిలబడి ఇటువంటి అమానుషమైన ఘటనలను ఖండించాలి. సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలి.

బి.చిన్నయ్య పడాల్
గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు

బిజెపి కుటిల రాజకీయంతోనే అల్లర్లు

బిజెపి కుటిల రాజకీయాలతోనే చరిత్రలో ఎన్నడూ లేనంతగా మణిపూర్‌లో అల్లర్లు జరుగుతున్నాయి. ఆదివాసి యువతులను వివస్త్రలను చేసి మాన ప్రాణాలు బలిగొంటున్న సంఘటనలతో సిగ్గుపడాలి. సభ్యసమాజం తలదించుకునేలా మహిళలను నగ్నంగా నడిరోడ్డుపై నడిపించడం, సామూహిక అత్యాచారానికి పాల్పడడం అత్యంత హేయమైన చర్య. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోకపోవడం విచారకరం.

ఎస్.హైమావతి
ఐద్వా జిల్లా కార్యదర్శి

క్రైస్తవులపై దాడులు హేయం

మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు దారుణం. మణిపూర్ క్రైస్తవులకు రక్షణ కల్పించాలి. మతోన్మాదులు దాడులు చేస్తూ చర్చిలను కూల్చడం, బైబిల్ కళాశాలను తగలబెట్టడం అన్యాయం. మతం ముసుగులో కొందరు హిందుత్వవాదులు మైనార్టీ మహిళలను చెరబడుతున్న తీరు భారత జాతికే కళంకం. పాలకుల నిర్లక్ష్య వైఫల్యంతోనే ఇలాంటి దారుణ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ హింసాత్మక ఘటనలు, దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం.

పి.డేవిడ్ రాజు
పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు

రోడ్డు లేని గ్రామాలను గుర్తించాలి

గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

అధికారులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని బోయ తేలి, కిల్లంకోట పంచాయతీ మారుమూల ప్రాంతాల్లో గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కాంతిలాల్ దండే ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. కిల్లంకోట వంతెన, బోయితిలి నుండి నూతనంగా నిర్మిస్తున్న రహదారి పనులు పరిశీలించారు. ఎస్.సి.ఎలో మరో రు.100 కోట్లు నిధులు మంజూరు చేయడానికి అవకాశం ఉందని, రోడ్డు సౌకర్యం లేని గ్రామాలను గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. జి.మాడుగుల మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న కాఫీ పల్పింగు యూనిట్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణాన్ని మరింత వేగవంతం చేయాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని తెలిపారు, ఆయన వెంట ఐటీడీపీఓ అభిషేక్, ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పెద్దిపాలెంలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు

ప్రజాశక్తి -ఆనందపురం: కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన ఆనందపురం మండలం పెద్దిపాలెం కింగ్స్ ఫంక్షన్ హాలులో మూడవ ఆంధ్రప్రదేశ్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ చాంపియన్ షిప్‌లో రాష్ట్రంలో 13 జిల్లాల నుండి 400 మంది బాల బాలికలు పాల్గొంటున్నారని, వీరందరినీ తీర్చి దిద్దిన మాస్టర్ల కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, కరాటే అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు కోలా ప్రతాప్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వాసుపల్లి శ్రీహరి, జనరల్ సెక్రటరీ జి.ఆనంద్‌బాలు, కోశాధికారి ఎమ్‌వి.రామమూర్తిరాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన వివాహిత ధనాల గణపతి (24) ఈ నెల 20 నుండి కనిపించడం లేదని ఆమె తండ్రి బంగారి రమణ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... విజయనగరం జిల్లా, దత్తిరాజేరు మండలం, పెద్ద ఖాతా గ్రామానికి చెందిన ధనాల రాముతో గణపతికి 2020లో వివాహమైంది. ఐదు నెలల నుంచి గణపతి కన్నవారి ఇంటి వద్దనే ఉంటోంది. ఈ నెల 20న భర్త రాము మామిడి పండ్లు తీసుకొని ఆనందపురం మార్కెట్‌కు వచ్చారు. తర్వాత రాము వెంకటాపురంలోని అత్తవారింటికి వెళ్లాడు. డబ్బులు విషయంలో భార్యతో గొడవపడ్డారు. తర్వాత రాము తిరిగి వాళ్ల ఇంటికి వెళ్లిపోయాడు. అదేరోజు టైలర్ వద్దకు వెళ్తానని గణపతి వాళ్ల అమ్మతో చెప్పి ఇంటి నుంచి నాలుగు గంటల సమయంలో వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు కంగారుపడి సమీపంలోనూ, బంధువుల ఇళ్లలోనూ, అత్తవారి ఇంటి వద్దా ఆరా తీశారు. ఎక్కడికీ రాలేదని తెలియడంతో ఆదివారం ఫిర్యాదు చేశారు. గణపతి ఐదు నెలలు గర్భిణి అని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి ఎఎస్‌ఐ పైడిరాజు దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని తీర ప్రాంతమైన బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు మైలపల్లి సోమేష్ చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మత్స్యకారుడు మైలపల్లి సోమేష్ ఆదివారం తెల్లవారు జామున తన సహచరులు నలుగురితో కలిసి చేపల వేటకు వెళ్లాడు. సముద్రంలో అలల ఉధృతి పెరగడంతో బోటు ముందుభాగంలో తూలి పడి బోల్తా పడింది. బోటు ముందు ఉన్న కర్ర అతని చాతీకి బలంగా తగిలి ముందుకు పడిపోవడంతో గాయం అయ్యింది. గమనించిన సహచర మత్స్యకారులు సోమేష్‌ను ఒడ్డుకు చేర్చి కారులో హుటాహుటిన నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పంచ గ్రామాల ఆవేదనను అర్థం చేసుకోవాలి

ప్రజాశక్తి-సింహాచలం: పంచ గ్రామాల ప్రజల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి పాసర్ల ప్రసాద్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి సత్యవాడ శంకరరావు కోరారు. స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విశాఖ తహశీల్దార్ ఇచ్చిన పట్టాలను ప్రస్తావిస్తూ సింహాద్రి అప్పన్న కొండతో పాటు రైతుల భూములకు సంబంధించి రెండు రకాలైన ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. కొండ ప్రాంతమంతా సింహాద్రి అప్పన్నకు దక్కేలా అప్పటి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని వివరించారు. భూమి విలువకు భూమిని ఇవ్వాలని చెబుతున్న వారంతా ఒక్కసారి గతాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. పంచ గ్రామాల్లో గృహ నిర్మాణదారులకు హక్కు కల్పించాలని కోరారు. 1903 గిన్నెస్ సర్వే నాటికే భూముల్లో రైతులు ఉన్నారన్న వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. జిరాయితీ భూముల్లో రైతుల హక్కులను పరిగణలోకి తీసుకోకుండా బానిసలుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం కొత్త టోల్గేట్ వద్ద జిరాయితీ భూముల్లో అధికారులు చేస్తున్న పనిని తప్పుపట్టారు. అభివృద్ధి పేరుతో పచ్చని తోటలను నాశనం చేయడం తగదన్నారు. భూముల వ్యవహారం కోర్టులో ఉన్న నేపథ్యంలో రైతుల భూముల్లోకి ఎలా వెళ్తారని ప్రశ్నించారు. సింహాచలం బిఆర్‌టిఎస్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పైడికొండ, ఆదిత్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జూ పార్కులో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ఆరిలోవ : లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్, రోటరీ క్లబ్ సంయుక్తంగా ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జూ సిబ్బంది, వాలంటీర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సుమారు 20 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ డాక్టర్ నందినీ సలారియా మాట్లాడుతూ, రక్తదానం చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. సర్టిఫికెట్లు, షీల్డులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో జూ అధికారులు, సిబ్బంది, లైఫ్ షేర్, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

గిరిజనుల హక్కులపై తీవ్ర దాడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలో గిరిజనుల హక్కులపై తీవ్ర దాడి జరుగుతోందని ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.రాధాకృష్ణ అన్నారు. అటవీ హక్కుల చట్టం సవరణ బిల్లును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని గిరిజన భవన్‌లో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు అంబిడి కోటేశ్వరరావు అధ్యక్షతన గిరిజనుల హక్కులపై ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన రాధాకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన అటవీ చట్టం గనుక అమలైనట్టయితే గిరిజనులకు నిలువనీడ కరువవుతుందన్నారు. అటవీ పరిరక్షణ చట్టం 1980 అడవి, దాని వనరుల పరిరక్షణకు హామీనిచ్చే భారత పార్లమెంటు చట్టమని పేర్కొన్నారు. ప్రస్తుతం గిరిజనులకు రక్షణ కల్పిస్తున్న చట్టాలు, హక్కులపై తీవ్రమైన దాడి జరుగుతోందని తెలిపారు. సమావేశంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి రూడా సత్యారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.సాంబమూర్తి, స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు బొండా తౌడన్న, ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షులు కిముడు చిన్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి జివిఆర్.మూర్తి. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం కార్యవర్గ సభ్యులు గీత, బి.వెంకటేశ్వర్లు, కె.జానకిరాజు, సీనియర్ సభ్యులు సిహెచ్.ధనుంజయ, ఎన్.పాపారావు, సభ్యులు బి.కృష్ణ, ఎస్.చిట్టయ్య పాల్గొన్నారు.

విద్యార్థులతో ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కో ఆర్డినేషన్ కమిటీ ప్రతినిధులు

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి 22వ వార్డు పరిధి పిఠాపురం కాలనీ పార్క్‌లో 50 మంది పేద విద్యార్థులకు ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్నులు, కంపాస్, పౌచ్, వారికి అవసరమైన ఇతర వస్తువులతో కూడిన కిట్లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఫౌండర్ డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ సహాయం చేస్తోందని తెలిపారు. ఓ వైపు ఉద్యమాలలో చురుగ్గా ఉంటున్న ఈ కమిటీ సేవల్లోనూ ముందంజలో ఉండటం అభినందనీయమన్నారు. కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ సూర్యప్రభ మాట్లాడుతూ చదువుకోవడానికి ఏదీ ఆటంకం కాకూడదన్న చిరు ప్రోత్సాహమే ఇదని తెలిపారు. ఐసిఇయు ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ మాట్లాడుతూ అందరూ బాగా చదువుకొని సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎం.కామేశ్వరి, తిరుమల, హరి జ్యోతి, పద్మావతి గోవింద్, శ్రీనివాసరావు, ప్రసన్న, శ్రీదేవి, లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ట్రైబల్ ఫెస్టివల్

ఆకట్టుకున్న గిరిజన నృత్యాలు

నృత్యాలతో ఆకట్టుకున్న కళాకారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహకారంతో గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో రెండు రోజులుపాటు నిర్వహించిన 'ట్రైబల్ ఫెస్టివల్' ఆదివారం సాయంత్రంతో ఘనంగా ముగిసింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు విశాఖపట్నం, పార్వతీపురం ప్రాంతాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి హాజరవుతారని అన్నారు.

అలరించిన ప్రదర్శనలు

చివరి రోజు కార్యక్రమంలో భాగంగా గిరిజన నృత్యాలు ఐటిడిఎ కెఆర్.పురం నుంచి కొమ్ము కోయ నృత్యం (కోయ తెగ వారు), ఐటిడిఎ రంప చోడవరం నుంచి కొమ్ము కోయ నృత్యం (కోయ తెగ, కొండ రెడ్డి తెగ), ఐటిడిఎ చింతూరు నుంచి రేలా కొమ్ము కోయ నృత్యం (కోయ తెగ), ఐటిడిఎ పాడేరు నుంచి మయూర దింసా (కొందు తెగ), ఐటిడిఎ పార్వతీపురం నుంచి సవర నృత్యం (సవర తెగ), ఐటిడిఎ సీతంపేట నుంచి జాతపు జానపద నృత్యం (జాతపు తెగ) అద్భుతంగా ప్రదర్శించారు. ప్రదర్శనల అనంతరం ఉత్తమ నృత్య ప్రదర్శన అందించిన బృందాలకు రాజన్నదొర బహుమతులు అందజేశారు. పలు ఐటిడిఎలలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల విజేతలకు నగదు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిరిజన క్రాఫ్ట్ వస్తువులు, వెదురు మైనంతో చేసిన ఆట బొమ్మలు, మామిడి పండ్లు, గిరిజన ఆహార ఉత్పత్తుల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చివరి రోజు కార్యక్రమంలో టిసిఆర్ అండ్ టిఎం మిషన్ డైరెక్టర్ ఈశా రవీంద్ర బాబు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాలకొండ ఎమ్మెల్యే కె.కళావతి, ఆంధ్రప్రదేశ్ ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్.లోవరాజు, టిసిఆర్ అండ్ టిఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం నడుమ సీలేరు డ్యాం

కట్టిపడేస్తున్న సీలేరు అందాలు

ప్రజాశక్తి - సీలేరు: సీలేరులో ప్రకృతి రమణీయమైన దశ్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. వారం రోజుల నుంచి సీలేరు దారకొండ పరిసర ప్రాంతాల్లో విస్తీరంగా వర్షాలు కురిసి ముసురు పట్టింది. దీంతో సీలేరు అటవీ ప్రాంతం స్థానిక జలవిద్యుత్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఆకుపచ్చ వర్ణం కలిగిన పచ్చని చెట్లు ఎత్తైన కొండలు ప్రకృతి ఒడిలో అందాలు చూపరులు మనసులను దోచుకున్నాయి. ఈ చూడచక్కని అందాలను సీలేరుకు చెందిన ధనుంజయ అనే యువకుడు డ్రోన్ కెమెరాతో చిత్రీకరించిన ఫోటోలు వాట్సాప్‌లో హల్ చల్ చేస్తూ పలువురికి ఆకట్టుకున్నాయి. దారాలమ్మ ఘాట్ రోడ్ సమీపంలో రెండు కొండల నడుమ జాలువారే జలపాతాలు ప్రయాణికులతో పాటు పర్యాటకులు తిలకిస్తూ మంత్రముగ్ధులవుతున్నారు. సీలేరు పరిసర ప్రాంతాల్లో మబ్బులతో కూడిన వాతావరణంతోపాటు నీలిమేఘాల కమ్ముకొని పొగ మంచు మేఘాలు అలుముకొని ఆకాశంలో పయనిస్తున్న దశ్యాలు సీలేరు పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సీలేరు జలవిద్యుత్ కేంద్రం, ఇంటెక్స్ డ్యాం, స్థానిక జలాశయంలో నదీ జలాలు వంటి దృశ్యాలు ఎంతగానో పలువురు ఆకర్షించాయి.

సాహితీ ఫార్మా పేలుడులో..

ఫోరెన్సిక్ నివేదిక కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని అచ్యుతాపురం సాహితీ ఫార్మాలో జరిగిన ప్రమాదంపై ఫోరెన్సిక్ నివేదిక కోసం విచారణ బృందం ఎదురుచూస్తోంది. ఇది రాగానే తుది నివేదిక తయారుచేయనున్నారు. ఆరుగురు కార్మికుల మృతికి కారణమైన సాహితీ ఫార్మా యాజమాన్యంపై త్వరలో పరిశ్రమల తనిఖీ అధికారులు కేసు నమోదుచేయనున్నారు. పరిశ్రమల తనిఖీ అధికారులు గతంలో గుర్తించిన లోపాలను సరిచేసుకొనివుంటే ఈ స్థాయిలో కంపెనీలో ప్రమాదం జరగడానికి అవకాశం తక్కువగా ఉండేది. అధికారుల నోటీసులపై యాజమాన్యం స్పందించకుండా యథాతథంగా కార్యకలాపాలు కొనసాగించింది. ఈ నిర్లక్ష్యమే ఆరుగురు కార్మికుల మరణాలకు దారితీసింది. ఉష్ణోగ్రతలను నియంత్రించే ఆటోమెటిక్, ప్రమాద నియంత్రణ వ్యవస్థలు సరిగా ఏర్పాటు చేయకపోవడంతో పాటు అర్హత, అనుభవంలేని వ్యక్తిని సేఫ్టీ సూపర్‌వైజర్‌గా నియమించినట్లు జాయింట్ కలెక్టర్ జాహ్నవి నేతృత్వంలో విచారణ బృందం నిర్వహించిన పరిశీలనలో తేలింది. ఈ పేలుడు సాహితీ ఫార్మా యాజమాన్యం తప్పిదాల వల్ల జరిగిన ప్రమాదమేనని నిర్ధారణకొచ్చినట్లు తెలిసింది. యాజమాన్యం కొన్ని భద్రతా ప్రమాణాలు పాటించివుంటే జూన్ 30న సాహితీ ఫార్మాలో సాల్వెంట్ శుద్ధి క్రమంలో భారీ మంటలు చెలరేగివుండేవికావన్న విషయం విచారణ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో యాజమాన్య తప్పిదాలు కొట్టొచ్చినట్లు కనిపించడంతో ప్రమాదానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ఫార్మా, ఇతర ప్రమాదకరమైన పరిశ్రమల్లో ప్రమాదాలు తరచూ జరుగుతుండడంతో అజాగ్రత్తగా వున్న ఈ కంపెనీ యాజమాన్యంపై బలమైన కేసులు నమోదుచేయాలన్న ఆలోచనలో అధికారులున్నట్లు సమాచారం. ఫోరెన్సిక్ నివేదిక రాగానే తుది నివేదిక తయారుచేసి యాజమాన్యంపై విచారణ బృందం చర్యకు సిఫార్సు చేయనున్నట్లు తెలిసింది. పరిశ్రమల తనిఖీ అధికారులు కూడా శాఖాపరమైన చర్యలకు సమాయత్తమవుతున్నారు. సాహితీ ఫార్మా యాజమాన్యంపై నమోదుచేయబోయే కేసులతో బీమా సొమ్ము కూడా యాజమాన్యానికి వచ్చే పరిస్థితి లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. సాహితీపై తీసుకొనే చర్యలతో భద్రతా ప్రమాణాలు, రక్షణ విషయంలో శ్రద్ధ వహించేలా ఇతర పరిశ్రమల యాజమానులకు సంకేతాలు ఇవ్వనున్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

మానసిక రోగులపై ప్రత్యేక దృష్టి - మందులు, నిధుల కొరత లేదు
'ప్రజాశక్తి'తో ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ రామిరెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

మానసిక రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు శతవిధాలా కృషి చేస్తున్నామని ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ కెవి.రామిరెడ్డి అన్నారు. విశాఖలోని తమ ఆసుపత్రిలో మానసిక రోగులకు, వారి కుటుంబీకులకు కల్పిస్తున్న సౌకర్యాలు, చికిత్సలు, మందుల లభ్యత, భవిష్యత్తు ప్రణాళికలు తదితరాలను ఆయన 'ప్రజాశక్తి'కి వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రభుత్వ మానసిక వైద్యశాల ద్వారా ఎటువంటి వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు ?

ప్రభుత్వ మానసిక వైద్యశాలలో ప్రధానంగా మెంటల్ ఇల్లిసినేస్ వ్యాధులు స్కిజోఫినియా, బైపోలార్ డిజాడర్స్, ఆల్కహాల్ డిపెండెన్స్ సిండ్రోమ్, అబ్సెసివే కంపేసివ్ డిజాడర్స్, న్యూరోటిక్ డిజాడర్స్, ఫోబియాస్, ప్యానిక్ డిజార్డర్స్ వంటి వ్యాధులకు చికిత్సలు అందిస్తున్నాం. వీటితోపాటుగా మెదడు ఎదుగుదల లేని పిల్లలు, చదువులో వెనుకబడిన పిల్లలు, సరిగా ప్రవర్తన లేని చిన్నారులకూ చికిత్సలు అందిస్తున్నాం.

ప్రస్తుతం ఆసుపత్రికి రోగుల తాకిడి ఎలా ఉంది ?

ఇది 300 బెడ్స్ కలిగిన హాస్పిటల్. ప్రస్తుతం ఇన్ పేషెంట్లుగా 238 మంది చికిత్స పొందుతున్నారు. అవుట్ పేషెంట్ విభాగంలో సగటున రోజుకు 500 మంది వరకూ హాస్పిటల్‌కు వస్తుంటారు. సోమవారం ఈ సంఖ్య 700 వరకూ ఉంటుంది.

ఆసుపత్రిలో సౌకర్యాలు, మందులు, నిధుల లభ్యత ఎలా ఉంది?

ప్రభుత్వం అన్ని విధాలుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తోంది. ఎపిడిహెచ్ఎం ద్వారా ఎల్లవేళలా మందులు అందుబాటులో ఉంటున్నాయి. సగటున రోజుకు 500 మందికి మందులు ఇస్తున్నాం. గత నవంబర్ నుంచి కొన్ని మానసిక రుగ్మతలను ఆరోగ్య శ్రీలో చేర్చారు. నిధుల లభ్యత పుష్కలంగా ఉంది.

రానున్న రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి కార్యకలాపాలేంటి ?

రానున్న రోజుల్లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రత్యేక డైట్‌ను ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇప్పటికే కెజిహెచ్‌లో ఆరోగ్యశ్రీ రోగులకు అందరికీ ప్రత్యేక డైట్ ఇస్తున్నారు. అయితే ఆ విధంగానే ఇక్కడ ఇవ్వడం సాధ్యం కాదు. అన్ని చికిత్సలూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని కారణంగా కొంత జాప్యం జరుగుతోంది. త్వరలోనే దీనిని అధిగమించి అందరు రోగులకు ప్రత్యేక డైట్ అందించేందుకు ప్రయత్నిస్తాం.